# అమ్మ

## శ్రీ మాక్సిం గోర్కీ

[మాక్సింగోర్కీ ప్రపంచ మహారచయితలలో ఒకరు. ఆయన శతజయంతి జరుగుతున్నది. తదుత్సవపురస్సరంగా ఆయన యీ కథను ప్రకటిస్తున్నాము.]

తల్లులను గురించి ఎంత చెప్పినా చెప్పవచ్చు.

ఆ నగరాన్ని శత్రుసైన్యం కూచివేసి, ఉక్కు చ్ఛటంలో బిగించినట్లు ముట్టడిలో అట్టిపెట్టింది. రాత్రులు అయినప్పుడు నెగళ్లు వెలుగుతున్నాయి. నగరం చుట్టూవున్న గోడలదాకా నల్లని మషీ కషాయాన్ని పోలి వ్యాపించివున్న ముదురు చీకటులలో ఆ నెగళ్లు చిమ్మిన మంటల కాంతులు అన్నీ అన్నీ రక్తం చిమ్ముతున్న కన్నులవలె మండుతున్నాయి. అపశకునాల్లాగా చెలరేగుతున్నాయి. ఆ మంటలు అట్లా మండుతూండగా ముట్టడి వేయబడిన నగరంలో భావాలు చీకటిని క్రమ్ముకుంటున్నాయి.

గోడలమీదినుంచి చూడగా, ఆ నగరంవారికి శత్రువు తను పన్నిన ఉచ్చును బిగిస్తున్నట్లు కనిపించింది. మండుతున్న నెగళ్ల ప్రక్క దీర్ఘమైన నీడలు కదులుతున్నాయి. ఆ ప్రక్కను గుర్రాలు వేస్తున్న హేషలు విన్పిస్తున్నాయి. ఆయుధాల ఝణఝణాత్కారాలు, సైనికుల విపరీతవికటాట్టహాసాలు, విజయంలోవిశ్వాసంగల సైనికజనసందోహంయొక్క కోలాహలం—ఇంతకన్నా మనుష్యుని ధైర్యాన్ని చీల్చడానికి భయభ్రాంతుణ్ణి చేయడానికి ఏమి కావాలి?

నగరానికి కాలువలద్వారా మంచినీరు ఎక్కుతుంది. శత్రువు ఆ కాలువలను శవాలతో నింపాడు. ద్రాక్షతోటలను తగులబెట్టాడు. పంట పొలాలను త్రొక్కించి వేశాడు. పళ్లతోటలను నరికించాడు. నగరం ఇప్పుడు అన్ని దిశల్లో అరక్షితంగా వుంది. ప్రతిరోజూ శత్రువు శతఘ్నులతో, తుపాకులతో నగరంలో అగ్నివర్షం కురుస్తున్నాడు.

నగర రక్షకులు యుద్ధంతో విసిగి పోయారు. వారికి సరిగా తిండిలేదు. నగరంలో వీథులు ఇరుకు. ఇరుకు వీథులలో వారు సంచరిస్తున్నారు. ఇండ్ల వాతాయనాలనుండి క్షతగాత్రులయిన వారి మూల్గులు వినవస్తున్నాయి. ఉద్భ్రాంతులైన వారి కేకలు ఘోరంగా ఉన్నాయి. తల్లులు ప్రార్థనలు చేస్తున్నారు. చంటిపిల్లలు ఏడుస్తున్నారు. జనం గుసగుసలుగానేగాని బిగ్గరగా మాట్లాట్టం లేదు. మాట్లాడుతున్న వాక్యం మధ్యలో తునగడమేగాని పూర్తికావడం లేదు. ప్రతి ఒక్కరూ వ్యగ్రులై వున్నారు. శత్రువు ఏమీ చేస్తున్నాడు? పట్టణంమీదికి వచ్చిపడుతున్నాడా?

రాత్రులు మరీ భయంకరంగా వుంటున్నాయి. రాత్రులయొక్క నిశ్శబ్దనీరవవాతావరణంలో జనుల మూలుగులు, అరుపులూ చెవులకు కఠోరమై వినిపిస్తున్నాయి. దూరంగా పర్వతాలు. పర్వతాలలో ఇరుకు లోయలు. ఆ యిరుకు లోయలగుండా సగం పడి చెడిన నగరపు కోటగోడలమీదికి నల్లని నీడలు ఎగబ్రాకుతున్నాయి. శత్రువు స్కంధావారం ఆ చీకటిలో కంటికి కనిపించదు. పర్వతాలనల్లనిఅంచుల మీదుగా ఖడ్గాలచేత మొక్కపోగొట్టబడిన డాలు వలె చంద్రుడు ఉదయిస్తున్నాడు.

నగరంలో ప్రజలు రక్షకులు ఎవరా అని

దయనీయమైన స్థితిలోపడి బాధ చెందుతున్నారు. ఆకలి వారిని బాధిస్తున్నది. యుద్ధకృషి ఇడియ బెడుతున్నది. వారికి ఆశలేదు. ఉన్న ఆశ రోజు రోజుకూ క్షీణిస్తున్నది. ఆ ప్రజలు సాధ్వసమనస్కులై కొండ అంచులమీద నిలిచిన చంద్రుణ్ణి చూచారు. ఆ కొండల అంచులు రాక్షసుల కోరలవలె కనిపిస్తున్నాయి. ఆ కొండల లోయలు చీకటి క్రమ్మిన ఉదరాలను పోలి కనిపిస్తున్నాయి. దూరంగా శత్రు స్కంధావారంలో రణగొణధ్వనిగా వుంది. ప్రతిఒక్క విషయమూ మరణాన్నే ఊదుతోంది. ఆకాశంలో ఎక్కడా నక్షత్రం లేదు. వారికి ఊరటలేదు.

ఇళ్లల్లో దీపాలు పెట్టడమంటే వారికి భయమైపోయింది. వీథుల్లో చీకటి బరువుగా క్రమ్ముకొని వుంది. ఆ చీకటిలో ఒక స్త్రీ నల్లని అవగుంఠనాన్ని కప్పుకొని, సవ్వడి చేయకుండా నడుస్తున్నది. ఆమె ఆ నడక ఎట్లా వున్నదంటే, ఒక నది లోతులలో తల్లిచేప కదులుతున్నట్టు ఉంది.

జనం ఆమెను చూచారు. నెమ్మదిగా అనుకున్నారు—

'ఆమె ఆవిడేనా?'

'అవును, ఆవిడే'

జనం వెనక్కి జరిగారు. తోరణాల స్తంభాల చాటుకు వెళ్లారు. తలలు వంచుకొని ఆమెను చూచీ చూడనట్లు వేగగమనులై ముందుకు నడిచారు. ఆరెకలు ఆమెను హెచ్చరించారు.

'మోనా మారియానా, మళ్లీ బయలుదేరావన్నమాట. జాగ్రత్త. ఎవరన్నా చంపివేయగలరు. ఆ తర్వాత ఏమీ లేదు. ఆ చంపినది ఎవరూ అనికూడా ఎవరికీ పట్టదు.'

వంగి నడుస్తున్న ఆమె ఒక్కసారి తల నిటారుగా పైకెత్తి నిలిచింది. ఆరెకులు వెళ్లిపోయినారు. వారికి ధైర్యంలేకనైనా పోయి వుండాలి. ఆమెను చంపడం వారికి అసహ్యమైనా అయివుండాలి. సాయుధులైన సైనికులు ఆమెను శవాన్ని చూచినట్టుచూచి ప్రక్కకు తప్పుకుపోయారు. ఆమె చీకటిలో ఒంటరిగా వుంది. ఎవ్వరూ లేరు. ఆమె ఒక వీథినుండి ఒకవీథికి ఏకాంతగమనం సాగించింది. చప్పుడు లేదు. చీకటిలో ఆమె ఆ నగరంయొక్క దురదృష్టము మూర్తి కట్టినట్లు వుంది. ఆమె చుట్టూ విషాద ధ్వనులు. ఆ ధ్వనులు ఆమెను వెంటాడుతున్నట్లు వున్నాయి. వెక్కుతున్నట్లు వున్నాయి. రాత్రిలోంచి ఆ ధ్వనులు వస్తున్నాయి. మూలుగులు. ఏడుపులు. ప్రార్థనలు. సైనికుల విషాదపు గుసగుసలు. వారికి ఎవరికీ విజయంలో ఆశ లేదు. ఆశ పోయింది.

ఆమె ఆ నగర వాసిని. తల్లి. అమ్మ. ఆమె తన కుమారుణ్ణిగూర్చి తలపోసింది. దేశాన్నిగూర్చి ఆలోచించింది. ఈ నగరాన్ని ఎవరుచుట్టుముట్టారు? ఆ చుట్టుముట్టిన సైన్యానికి నాయకుడెవడు? వాడు తన కడుపున పుట్టిన కొడుకు. వాడు నిత్య సంతోషి. అందమైన వాడు. వాడికి హృదయం లేదు. వానిని తాను కన్నది. వానినిచూచి తాను ఎంత గర్వపడ్డది? ఆ గర్వపడి ఇంకా ఆట్టేకాలం కాలేదు. తన దేశానికి వాడు ఏదో వొరగబెడతాడని ఆమె భావించింది. ఈ తన నగరాన్ని రక్షించేందుకు వాడు ఏదో చేస్తాడని అనుకుంది. అట్టి అదృష్టశక్తిని తాను ఈ పుత్రరూపంలో ప్రసవించానని అనుకుంది. ఈ నగరం తాను పుట్టిన నేల. తన కొడుకూ అక్కడే పుట్టాడు. తను వానిని అక్కడే పెంచింది. తన పూర్వికులు తండ్రులు, తాతలు ముత్తాతలు ఈ నగరంలో ఇళ్లు కట్టుకున్నారు. నగరంచుట్టూ గోడలు లేపారు. తనకూ, ఈ పట్టణానికీ ఉన్న సంబంధం ఇప్పటిదా? తన గుండె, కంటికగుపించని అదృశ్యతంతువులచేత అచ్చటి రాళ్లకు కట్టివేయబడినట్టువుంది. అచ్చటి నేలలో తన జ్ఞాతి బంధువుల ఎముకలు నిక్షిప్తాలై వున్నాయి. ఆ నేలతో తనకు ఉన్నసంబంధం అట్టిది. అచ్చటి కథలు పాటలు, అచ్చటి ప్రజల ఆశలు ఆకాంక్షలు తన్ను కనిపించని దారాల్లాగా బంధిస్తున్నాయి. తన హృదయాన్ని పట్టుకుంటున్నాయి. ఆ హృదయం ఇప్పుడు దయనీయమైపోయింది. తాను ప్రేమించిన కొడుకు తనకు కాకుండా అయివాడు. ఆమెకు ఏడ్పువచ్చింది. ఏడ్చింది. అతడు తన కొడుకు. ఇది తను పుట్టిన నేల, తన పట్టణం. కొడుకు అంటే

ప్రేమ. పుట్టిన పట్టణం అంటే ప్రేమ. ఈ రెండు ప్రేమలను ఆమె తన హృదయాన్ని తులాదండంచేసి తూచింది. ఆ త్రాసు ఎటు మొగ్గిందీ? ఆమెకు తెలియలేదు.

ఆ రాత్రి అంతా ఆమె అట్లా ఆ పట్టణపు వీథుల్లో సంచరించింది. ఆమెను ఎవరూ గుర్తుపట్టలేకపోయారు. మృత్యువు అట్లా రూపంకట్టి వీధుల్లో సంచరిస్తున్నది అని వారు భయపడ్డారు. వెనక్కు తగ్గారు. మృత్యువు వారికి అంత సన్నిహితమై వుంది. ఆమెను గుర్తుపట్టినప్పుడు, వారు విషాదమౌనంతో తప్పుకు పోయారు. ఆమె, ఒక ద్రోహినికన్న తల్లి.

నగరంలో ఒక రోజున కోటగోడల మారుమూలల్లో ఆమె మరి ఒక స్త్రీని చూచింది. ఆ స్త్రీ ప్రక్కన ఒక శవం; ఆ శవం దగ్గర ఆమె మోకరిల్లి వుంది. ఆమెలో కదలిక వున్నట్లు లేదు. ప్రత్యంత ధాత్రిలో ఆమె భాగమా అన్నట్లుగా వుంది. ఆ స్త్రీ ప్రార్థనలు చేస్తున్నది. దుఃఖంచేత ఆమె ముఖం తాడితమై దయనీయంగా వుంది. ఆమె తలఎత్తి ఆకాశంలోని నక్షత్రాలవంక చూస్తున్నది. కోటగోడలపై ఆరెకులు సన్నని కంఠాలతో మాట్లాడుతున్నారు. వారి ఆయుధాలు రాళ్లకు తగిలి ధ్వని అవుతున్నది.

ద్రోహితల్లి ఆ స్త్రీని అడిగింది.

'నీ భర్తా?'

'కాదు.'

'అన్నా, తమ్ముడా?'

'కాదు. నా కుమారుడు. నా భర్త చనిపోయి పదమూడు ఏళ్లయింది. ఆ భర్త చంపబడినాడు. ఇవ్వాళ్ల నా కుమారుడు చంపబడినాడు.'

ఆ స్త్రీ నెమ్మదిగా లేచింది. వినయంతో ఆమె ఇట్లా అన్నది:

'పైన మెడోనా వున్నది. ఆమె అన్నీ చూస్తుంది. ఆమెకు అన్నీ తెలుసు. ఆమెకు నేను కృతజ్ఞను.'

'ఎందుకట!' అన్నది అవతలి తల్లి.

ఆమె సమాధానం చెప్పింది.

'నా కుమారుడు దేశంకోసం పోరాడుతూ వీరమరణం చెందాడు. ఆ మరణంలో గౌరవం వుంది. ప్రతిష్ఠ వుంది. నేను అతణ్ణిగురించి భయపడ్డాను. ఆ మాట గట్టిగా అనగలను. కుర్రవాడు తేలికగుండేవాడు. అల్లరి అంటే ఇష్టమైనవాడు. దేశానికి ద్రోహం చేస్తాడేమోనని భయపడ్డాను. ఆ మారియానా వున్నది; ఆమె కుమారుడూ వున్నాడు. అతను దేశానికి ద్రోహం చేశాడు. అట్లా వీడు గూడా చేస్తాడేమోనని చచ్చిపోయినాను. ఆ మారియానా కొడుకు వున్నాడే వాడు దేవునికి విరోధి; మనుష్యుడికీ విరోధి. వాడు మండిపోను, వాడు ఇప్పుడు మన విరోధులకు నాయకుడు – వానిని కన్నతల్లి కడుపు మండిపోను.'

మారియానా తన ముఖాన్ని కప్పుకున్నది. వచ్చిన దారిని వెళ్లిపోయింది. ఆ మరునాడు మారియానా నగర రక్షకుల దగ్గరకు వెళ్లింది. ఇట్లా అన్నది:

'నా కుమారుడు మీకు విరోధి అయిపోయినాడు. మీరు నన్ను చంపనైనా చంపండి; లేదా నా కుమారుని దగ్గరకైనా వెళ్లనీయండి.'

వారు బదులు చెప్పారు. 'మారియానా! నువ్వు మనిషివి. మనిషికి ఆత్మదేశంకన్నా ప్రియతమమైంది లేదు. నీకూ అంతే ననుకుంటున్నాము. నీ కుమారుడు వున్నాడంటే, వాడు మాకు ఎంతటి విరోధో, నీకూ అంతటి విరోధీ అవును.'

'నేను వాని తల్లిని. వానిని ప్రేమిస్తున్నాను. వాడు అట్లా అయిపోయినాడంటే, ఆ తప్పంతా నాదేనని అనుకుంటున్నాను.'

నగర రక్షకులు వారిలో వారు ఆలోచించుకున్నారు. చివరకు ఒక నిర్ణయానికి వచ్చారు.

'నీ కుమారుడు పాపం చేశాడు. ఆ పాపానికి నిన్ను చంపడం ధర్మమా! గౌరవమా? వాడు ఈ పాపం చేస్తున్నాడు అంటే, అందుకు నువ్వు కారణమా! మాకు తెలుసు. నువ్వు కారణం కాదు. నీ

బాధ ఏమిటో మాకు తెలును! మారియానా! మాకు తెలును. నిన్ను ఉపప్రభువుగా మేము పట్టుకోవచ్చు. కాని అది మాకు ఇష్టంలేదు. నగరంలో ఎవ్వరూ అట్లా చెయ్యాలని వాంఛించడం లేదు. నీ కొడుక్కు నీవంటే గౌరవం వున్నదా! వాడు నిన్ను గౌరవించడం లేదు. నీవంటే అసలు వాడికి ఖాతరు లేదు. అసలు నిన్ను వాడు మరిచిపోయాడేమోకూడా. మరిచి పోయే వుంటాడు. వాడు మనిషేమిటి? వాడు దెయ్యం. వట్టి రాక్షసుడు. నీకు అంతకన్నా ఎవరు ఏమి శిక్ష వెయ్యగలరు. శిక్షను అనుభవించాలి అని నీకు వుంటే, ఆ శిక్ష ఈరూపంలో నీకు అదివరకే పడింది. మరణకన్నా ఘోరమైన శిక్ష.

'అవును, అవును. అంతకన్నా భయంకరమైంది.'

వారు కోటద్వారాలు తెరిచారు. ఆమె నగరాన్ని వదిలి వెళ్లిపోయింది. ఆమె పోతూవుండగా కోట బురుజులమీదనుండి వారు చూస్తూ పెద్దకాలం అట్లా నిలబడిపోయారు. ఆమె తన తల్లి నేలను వదిలిపోతూవుంది. ఆ నేల ఆమె కుమారుడు చిందిన రక్తంలో సిక్తమైపోయివుంది. ఆమె నడవలేక నడవలేక నడుస్తున్నది. అడుగులు పడటంలేదు. ఆ నేలను, ఆ తల్లినేలను వదిలిపెట్టలేకపోతున్నాయి. నగరాన్ని రక్షిస్తూ ఎందరో చనిపోయారు. వారి శవాలు ఆ దారి అంతటా పడివున్నాయి. ఆమె ఆ శవాలను చూచి గౌరవగర్వంగా తల వంచింది. విరిగి చెదిరి వేదురువుగా పడివున్న ఆయుధపుముక్కను కాలితో సత్యమైన జుగుప్సను వెలారుస్తూ తన్ని వేసింది. తల్లులకు ఆయుధాలంటేనే అసహ్యం. అందరు తల్లులకు అంతే. ప్రాణిలోకాన్ని రక్షించే ఆయుధం వున్నదో! ఆ ఆయుధం వుంటే తృణీకరించరు.

ఏదో పవిత్రజలభాండాన్ని పట్టుకొని, ఆ పవిత్రజలం చిందితే, ఒక్కబొట్టు క్రిందపడితే, ఏమో అయిపోతుందన్న భయంతో నడిచే మనిషి ఎట్లా నడుస్తాడో, ఆమె అట్లా నడుస్తున్నది. కోట గోడలమీద నిలిచి చూస్తున్నవారికి ఆమె క్రమక్రమంగా దూరమై, దూరమై ఆమె ఆకారము చిన్నదై, చిన్నదై చివరకు కనిపించకుండాపోయింది.

ఆమె ఆ పోవడముతో నగరంలో నీరవమైన నిరాశ, సర్వమైన వైక్లబ్యము తొలగినట్లు ఆ దురదృష్టమంతా ఆమెతో నడిచిపోయినట్లు వారికి అనిపించింది.

సగందూరంలో ఎక్కడో ఆమె ఆగినట్లు, తలపై వేసుకొనివున్న అవగుంఠనాన్ని తొలగించి నట్లు, నగరంవంక దీర్ఘంగా చూచినట్లు అనిపించింది.

శత్రుస్కంధావారంలోనివారు ఆమెను, ఏకాకిని చూచారు. యుద్ధరంగం నడుమ నిలబడివుండగా చూచారు. నల్లని ఆకృతులు కలవారు, నడి చేయక, చప్పుడుచేయక ఆమెకు దగ్గరగా వచ్చారు. ఆమెను చూచారు. ఎవరు నువ్వు, ఎక్కడనుంచి వస్తున్నావు—అని అడిగారు.

'నేనా, వీా సేనాని నా కుమారుడు. నేను వాని తల్లిని.'

ఆమె ఆ మాటను ఎవ్వరూ కాదన లేదు. ఎవ్వరూ అనుమానించలేదు. వారు ఆమె ప్రక్కనే నడిచారు. ఆమెకుమారునిగురించి జయగీతాలు ఆలపించారు. ఆయన తెలివి తేటలు ఏమి! ఆయన ఎంతటి వీరుడు! ఆమె వారి పాటలను విన్నది. మాటలను విన్నది. గర్వంతో తల ఎత్తింది. ఆమె ముఖంలో ఆశ్చర్యం లేదు. ఆమె ఆశ్చర్యపడలేదు. తన కుమారుడు వీరుడు కాక ఏమి అవుతాడు? అవును, వీరుడే.

ఎట్టకేలకు ఆమె ఆ కుమారుని ముందు, వాడు పుట్టడానికి ముందు తొమ్మిది నెలల ముందునుండీ తనకు తెలిసినవానిముందు, తనహృదయం కంటే వాడు వేరుకాదని తాను భావించిన వాని ముందు, నిలబడింది. అతను చీనాంబరములలో, వెల్వెటులలో, రత్నములచేత స్థగితమైన ఆయుధాలతో ఆమె ముందు నిలిచాడు. అంతా ఎట్లా వుండాలి, అంతా అట్లానే వుంది. ఆమె అతనిని గూర్చి కలలు కన్నది. ఆ కలలలో అతను అట్లాగే ఆమెకు కన్పించాడు. ఆఢ్యుడు. కీర్తిశాలి. పొగడ్తలకు స్థానమైన వాడు.

'అమ్మా!'

ఆమె చేతులను చేతులలోనికి తీసుకొని కన్న తల్లి చేతులను అతను తన పెదవులతో స్పృశించాడు. ముద్దు పెట్టుకున్నాడు.

'అమ్మా! నువ్వు నా దగ్గరకు వచ్చావు. నువ్వు నాతో వున్నావు. రేపు ఆ పాపపు పట్టణాన్ని పట్టుకుంటాను.'

'ఏ పట్టణాన్ని? నీవు పుట్టిన పట్టణాన్నా?' అవి ఆమె జ్ఞాపకం చేసింది.

అతడు తన శక్తి అనే మద్యాన్ని త్రావి కైపు ఎక్కివున్నాడు. కీర్తిదాహం తీరక నితాంత పిపాసి అయిపోయినాడు. యౌవనగర్వంయొక్క అహంకారపు వేడిమి వానిలో జగా మండుతున్నది.

'నేను ఈ ప్రపంచంలో పుట్టాను. ప్రపంచం కోసం పుట్టాను. నేనంటే ఈ ప్రపంచం హడలి ఆవటిల్లేట్లు చేస్తాను. నిన్నుచూచి నీకోసం ఈ పట్టణాన్ని ఇప్పటిదాకా వదిలిపెట్టాను. దయ దాల్చాను. ఇది నా హృదయంలో శల్యంలాగా వుంది. నన్ను పైకి రానీయలేదు. అడ్డువచ్చింది. రేపు ఈ పట్టణం పని పట్టిస్తాను. తల పొగరుపట్టిన మూరుల పీచం అణుస్తాను.'

'అక్కడ ప్రతిరాయికి నువ్వు తెలుసు. నీ చిన్నతనం ఎరిగిన రాళ్ళు. నిన్ను మరిచిపోని రాళ్ళు.'

'రాళ్ళకు నోరు ఎక్కడ వుంది. అవి మూగవి. మనుష్యుడు మాట్లాడించగల్గాలి. అప్పుడు నోళ్ళు విప్పుతాయి. నాకు ఈ రాళ్ళ మాట్లాడ్డంకాదు కావలసింది. నన్నుగురించి పర్వతాలు మాట్లాడాలి. నేను కోరేది అదే.'

'మరి మనుష్యులు మాట్లాడనక్కరలా?'

'మాట్లాడాలి. వాళ్లను నేను మరిచి పోలేదు. అమ్మా! మనుష్యులుకూడా నాకు అవసరమే. మరి వీరులు వున్నారంటే వాళ్లకు అమృతత్వం ఎక్కడ? మనుష్యుని ధారణలోనే కదా!'

ఆమె అన్నది.

'వీరుడు, వీరు డంటున్నావు. వీరుడంటే ఎట్టివాడు! మృత్యువును అధఃకరించి ప్రాణాన్ని సృష్టించేవాడు; మృత్యువును జయించే వాడు...'

అతను 'కాదు' అన్నాడు. 'అట్టివాడా వీరుడు' ఛా! కాదు. నిర్మాత ఎంత గొప్పవాడో, సంహర్త కూడా అంత గొప్పవాడు. రోమ్ నగరాన్ని ఎవరు కట్టారో ఎవరికి తెలుసు. ఏనీస్ కట్టాడో, రోమ్యులస్ కట్టాడో! ఎవరు చెబుతారు. మరి ఆలరిక్ పేరు తెలియని వారు ఎవరు! రోమ్‌ను నాశనం చేసిన ప్రతి ఒక్కరు వీరులే అయినారు.'

'ఆ వీరులు పోయారు. రోమ్ నిల్చివుంది.'

వారి సంభాషణ ఇట్లా సాగింది. అంతలో సూర్యుడు అస్తమించాడు. సూర్యుడు అస్తమించే దాకా వారు మాట్లాడుకున్నారు. ఆ మాటలు ఇట్లాగే వున్నాయి. పోను పోను ఆమె ఎక్కువ మాట్లాడలేదు. వానినే మాట్లాడ నిచ్చింది. ఆ మాటలు ఇట్లాగే గాడితప్పి సాగాయి. ఆమె అడ్డు చెప్పలేదు, విన్నది: వింటూ, వింటూ వున్న కొద్దీ గర్వంతో ఎత్తిన ఆమె శిరస్సు క్రిందికి దిగిపోయింది.

తల్లి సృష్టిస్తుంది. తల్లి రక్షిస్తుంది. ఆమె ముందు సంహారాన్ని గురించి మాట్లాడటం అంటే ఆమెకు వ్యతిరేకంగా మాట్లాడమే. ఆమెను కాదనడమే. వానికి, అది తెలియదు. స్థితిహేతువు ఆమెయందు వుంది. ఆ హేతువును తాను పూర్వపక్షం చేస్తున్నట్లు, ఖండిస్తున్నట్లు వానికి తెలియదు.

మృత్యువును తల్లి సహిస్తుందా! మృత్యువు అమ్మ విరోధివర్గంలోనిది. ఆ మృత్యువును తల్లి నిరసిస్తుంది. ప్రతిఘటిస్తుంది. కొంపలమీదకు మృత్యువును తెచ్చే చేతులను అమ్మ అసహ్యించుకుంటుంది. తల్లులు అసహ్యించుకుంటారు.

కుమారునికి అది తెలియదు. తెలియలేదు. కీర్తి దాహపు రూక్షకాంతులలో వాని కన్నులు మిరుమిట్లు కొన్నాయి. వానిగుండె బండబారింది.

వానికి తెలియని సంగతులు మరియు కొన్ని వున్నాయి.

ఒక తల్లి తెలివి, ఒక తల్లి నిర్దాక్షిణ్యురాలు

కాగలతనము, ఒక తల్లి నిర్భీకురాలు కాగలస్థితి ఇవి వానికి తెలియవు.

తల్లి సృష్టికర్త్రి.

ఆ సృష్టికి విలయం వచ్చినప్పుడు, ఆ తల్లి తెలివికలది, నిర్దాక్షిణ్యురాలు, నిర్భీక అవుతుంది.

ఆమె వంచిన తలగలదై కూర్చున్నది. కుమారుడు విడిసిన గుడారము వైభోగాలలో తులతూగుతున్నది. గుడారపు ద్వారపుతెర తొలగగా ఆ సందునుండి ఆమె తన పట్టణంవంక చూచింది. ఆ పట్టణంలో ఈ శిశుపిశునం తనలో మెదిలింది. ఆమె మధురసాధ్వసవశంవదఅయిన రోజులవి. ఆ బిడ్డను కనినప్పుడు తాను నొప్పులుపడ్డది. ఇప్పుడు ఆ పిశునము, ఆ బిడ్డ, ఇట్టిడై, ఆ తననగరం యొక్క వినాశంకోసం తృషఎత్తి మృషామానవుడై కొట్టుకుంటున్నాడు.

సూర్యుడు ఉదయించాడు. తన కిరణాలతో కోటగోడలను, బురుజులను రక్తాన్ని పోని ఎర్రదనంతో మలాము చేస్తున్నాడు. ఎర్రనిఎండ కిటికీల తలుపులవిూదపడి పట్టణంఅంతా పుండ్లతో నిండినట్లు, ప్రాణంయొక్క సత్వం ఎర్రనిరంగు గలదై ప్రతిఒక్క పండునుండీ రసికారుతున్నట్లు వుంది. అంతలో పట్టణం శవాన్ని పోలి నల్లనైపోయింది. ఆకాశంలో నక్షత్రాలు దహనసంస్కారవేళాప్రవర్తిత దీపకళికాసమూహాన్ని పోలి, ఆ పట్టణంపై మినుకుమినుకు మన్నాయి.

పట్టణంలో ఇళ్లు చీకటిముద్దల్లాగా కన్పిస్తున్నాయి. జనం ఇళ్లల్లో దీపం వెల్గించడానికి భయపడుతున్నారు. శత్రువుకు తమ చహరా తెలియనీయరాదు. వీథులు చీకటి ప్రవహిస్తున్నట్లు వున్నాయి. శవదుర్గంధంచేత బీభత్సంగా వున్నాయి. జనం బిగ్గరగా మాట్లాడరు. భయం. చెవులు కొరుకుకొనడమేగాని మాట విన్పించదు. ఇచ్చట తన కుమారుని స్కంధావారంలో కూర్చుండివున్న ఆమెకు ఇది అంతా కళ్లముందు ఆడింది. ఆ పట్టణం తనకు ప్రియమైంది. తనకు సన్నిహితమైంది. ఇప్పుడు ఆ పట్టణం మూగ వోయినట్లు నిస్తబ్ధనీరవమై, తాను ఏమిచేస్తానా అని ఎదురు చూస్తున్నది. తన నిర్ణయంకోసం కాచుకుకూర్చున్నది. తాను తల్లి. మాతృమూర్తి. ఆ ప్రజలంతా తన కన్న బిడ్డలు. వారికి నేను తల్లిని అని ఆ తల్లి అనుకున్నది. మాతృతత్వం ఆమెను ఆవేశించింది.

నల్లనికొండల కొమ్ములనుండి స్తనయిత్నుసమూహాలు ఆ లోయను క్రమ్ముకున్నాయి. అవి రెక్కలు మొలిచిన గుర్రాలా! ఆ పట్టణాన్ని రయరింఖా ఘురట్ట ఘట్టనంగా రట్టు చేశాయి.

'ఈ రాత్రి మనం దాడి చెయ్యవచ్చు' అన్నాడు నాయకుడైన ఆమె కుమారుడు.

'ఈ రాత్రి ఇట్లా చీకటిగావేవుంటే, దాడి ప్రారంభించవచ్చు' అన్నాడు.

'సూర్యుడు కళ్లలో పొడుస్తూవుంటే మనుష్యుల్ని చంపడం కష్టం. ఆయుధాల తళత్తళలు కళ్లను పొడుస్తాయి. కత్తివాటం తప్పిపోవచ్చు' అన్నాడు.

అతడు తన కత్తిని పరీక్షించుకున్నాడు.

అమ్మ అన్నది.

'నాయనా! ఇట్లారా! ఇట్లా ఈ వక్షం విూద నీ తల అన్చు. నా ఒళ్లో కూర్చో. విశ్రాంతి తీసుకో. చిన్నప్పుడు నువ్వు ఎంత సంతోషంగా వుండేవాడివి. ఎంతటి దయ చూపించేవాడివి. నా తండ్రి! అప్పుడు నిన్ను అంతా ఎంతగా ప్రేమ చేసేవాళ్లు......'

అతడు తల్లిమాట విన్నాడు. ఆమె చెప్పినట్లు చేశాడు. తలను ఆమె ఒడిలో పెట్టాడు. కళ్లు మూసుకున్నాడు.

'అమ్మా! నాకు కీర్తిఅన్న ఒక్కదినుసులంటేనే ప్రేమ. నీవు అంటే గౌరవం. నన్ను మరి ఇంత వాణ్ణి చేశావు' అన్నాడు.

'మరి స్త్రీలంటేనో' అన్నది ఆమె అతని విూదకు వొంగుతూ.

'వాళ్లు చాలామంది వున్నారమ్మా! తీపి వస్తువు వుంది. తినగాతినగా ముఖం మొత్తుతుంది.

స్త్రీల విషయము అంతే' అన్నాడు అతను.

'నీకు సంతానం కావాలన్న వాంఛలేదా?' అన్నది ఆ తల్లి.

'ఎందుకు ? చంపబడటానికా? నావంటివాడు ఏవ్వడో వారిని సంహరిస్తాడు. అది నాకు బాధగా వుంటుంది. అప్పటికి నేను ముసలివాణ్ణైపోతాను. వారిని సంరక్షించుకోలేని వాణ్ణి, పగతీర్చుకోలేని వాణ్ణి అయిపోతాను' అన్నాడు అతను.

'నాయనా! నువ్వు అందంగా వున్నావురా! ఆ అందం ఏమి అందం. తటిల్లతలాగా గొడ్డు మోతు అందం.' అన్నది ఆమె.

ఆ తల్లివాడిలో, ఆ తల్లి వక్షస్థలంమీద తలపెట్టుకొని, అతను ఎడపిల్లవానివలె మాగన్ను పెట్టాడు.

ఆ తల్లి తన నల్లని అవగుంఠనాన్ని తొలగించింది. ఆ బిడ్డపై కప్పింది. కత్తిని అతని హృదయంలో ప్రాణదఘ్నంగా గుచ్చింది. అతడు చనిపోయినాడు. హడిలి చనిపోయినాడు. తల్లికన్నా కన్నకొడుకు గుండెగురి ఎవరికి తెలుస్తుంది! అంగరక్షకులు ఆశ్చర్యస్తంభాకృతులై పోయినారు. ప్రాణం పోయిన ఆ కట్టెను ఆమె వారిపాదాల దగ్గరపడేట్లు త్రోసివేసింది.

ఆమె తన నగరాన్ని సంబోధించి ఇట్లా అన్నది.

'నేను ఈ పట్టణం పౌరురాలను. దేశానికి ఎంత చేయగలను, అంతా చేశాను. నేను తల్లిని, నా కుమారుణ్ణి వదిలిరాలేను. నేను పెద్దదానినైనాను. సంతానం కల్గేవయస్సు మించి పోయింది. నాలో ప్రాణం ఆడి ఎవరికి లాభము, ఎవరికి ప్రయోజనము! ఎవ్వరికీ లాభంలేదు, ఎట్టి ప్రయోజనము లేదు.'

కుమారుని రక్తంలో ఆమె చేపట్టిన కత్తి ఇంకా వేడిగావుంది. ఆ రక్తం తన రక్తం. ఆ కత్తితో ఆమె తన్నుతాను పొడుచుకున్నది. గుండెలకు గురిచూచి పొడుచుకున్నది. ఆమె హృదయం దుఃఖావిలమైనట్టిది. అట్టి హృదయాన్ని వెదకనక్కర లేదు. ఆ కత్తిపోటు సత్యంవలె ఆమె హృదయాన్ని చీల్చింది.

—''టేల్స్ ఆఫ్ ఇటలీ''నుంచి

